# సంతోషం

-పగడాల పాండుయాదవ్



"ఏమోయ్ కాంతం! ఈరోజు మా వనజ కొడుకుని కాన్వెంట్‌లో చేర్పిస్తున్నారట. మనమూ వెళదామా!'' అంటూ భార్యని అడిగాడు గోపాలం.

"మీకు పిచ్చి పట్టిందా? అక్కడికి వెళ్లామా ఎంతో కొంత మనకూ ఖర్చు అవుతుంది. డొనేషన్నీ, బ్యాగు, పుస్తకాలు ఇలా ఎంతో కొంత మన నెత్తినా రుద్దుతారు. అసలే వాళ్లింట్లో దరిద్రం కాపురం చేస్తుంటుంది. ఎప్పుడెప్పుడు కొంపమీద పడి దోచుకు తిందామా అని మీ గారాల చెల్లి ఎదురు చూస్తుంటుంది'' అని కసిరింది కాంతం.

"ఏంటి కాంతం! అలా మాట్లాడతావు. అది నా తోడబుట్టిన చెల్లి. ఉన్నది ఒక్కతే. కనీసం దాన్నైనా చూడకపోతే ఎలా? బంధువులున్నది కష్టాలలో ఆదుకోవడానికే. లోకం ఏమంటుంది? సొంత అన్నయ్య ఉండి కూడా ఇన్ని కష్టాలా అనుకోరు? పైగా వాళ్లబ్బాయికి మన అమ్మాయిని ఇద్దామను కుంటున్నాంగా. ఎంతైనా మనవాళ్ళు'' అని అర్థిం చాడు గోపాలం.

"చాల్లే ఆవండి మీ సంబడం. నాలుగేళ్ల క్రితం వాళ్ళు కోటీశ్వరులు ఇప్పుడు దరిద్రులు. ఫ్యాక్టరీ కాలిపోయి, చిట్‌ఫండ్ సంస్థలు దివాళా తీసి, మీ బావ ఆరోగ్యం చెడిపోయి అప్పుల పాలై అడుక్కు తింటున్నారు. ఏదో ఒకరోజు ఈ అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకుంటారు. అలాంటి బిచ్చగాళ్ల ఇంటికి నా కూతురిని ఇవ్వడమా? ఇది జరగని పని. ఈరోజు నుండి వాళ్లకు మనకు సంబంధాలు తెగిపోయాయి అనుకోండి'' అంది గయ్యాళి కాంతం.

కాంతం మాటలకు గోపాలం ఎంతో బాధప డ్డాడు. డబ్బు ఉన్నరోజుల్లో రోజూ వాళ్లింటికి వెళ్లి ఏదో ఒకటి తెచ్చుకునే కాంతం ఈరోజు వాళ్ళు కష్టాలలో ఉంటే ఇలా మాట్లాడుతోందా! అని అను కున్నాడు.

అయినా సరే చివరి ప్రయత్నంగా కాంతంకు ఏదో సర్ది చెప్పబోయాడు. కాంతం రుద్రకాళి అవ తారం ఎత్తి ఇంట్లోని సామానంతా ఎత్తేసి, తన్నేసి వంటింట్లోకి వెళ్లి కిరోసిన్ డబ్బాతో సిద్ధమైంది.

దీంతో హడలిపోయిన గోపాలం మనసు చంపుకుని ఓ మూల కూలబడిపోయాడు. 'నీ ఇష్టం' అన్నాడు బాధగా.

* * *

ఇరవై సంవత్సరాల తర్వాత...

"ఏమండీ! త్వరగా లేచి తయారవ్వండి'' అంటూ ఆర్డర్ వేసింది కాంతం.

"ఏమిటో విశేషం!'' అంటూ ఆరా తీశాడు గోపాలం.

"ఈరోజు మన మేనల్లుడు లండన్ నుండి వస్తు న్నాడట. మనం త్వరగా ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లాలి''

"మనకు మేనల్లుడు ఎవరున్నారు?''

"అదేనండీ మన వనజ కొడుకు''

"వస్తేరానీ మనకెందుకు? వాళ్లకూ మనకూ సంబంధాలు ఇరవై సంవత్సరాల క్రిందే తెగిపో యాయి. నేనైతే ఆ విషయాన్నే మరచిపోయాను. నువ్వూ మరచిపోతే మంచిది'' అన్నాడు గోపాలం.

"అబ్బ నోరుమూసుకోండి. ఏమిటా మాటలు. అప్పుడంటే వాళ్ళు కటిక దరిద్రులు. తినడానికి తిండి లేనివారు. మరిప్పుడు వాళ్ళ అబ్బాయికి లండన్‌లో పెద్ద ఉద్యోగమంట. లక్షల్లో జీతమట. మన పక్కింటి రాజ్యం చెప్పింది''

"నువ్వెన్నైనా చెప్పు. నేను రాను. అందరూ ఏమనుకుంటారు? ఇన్ని సంవత్సరాలలో వాళ్లకో రూపాయి సాయం చేసి ఎరగం. వాళ్ళు మనల్ని మరచిపోయి ఉంటారు. నువ్వు వాళ్లని మరచిపోతే మంచిది'' కాస్త కటువుగానే అన్నాడు గోపాలం.

"నేను చెప్పేది జాగ్రత్తగా వినండి. ఈ రోజుల్లో అమ్మాయి పెళ్లి ఎంత కష్టమో మీకు తెలుసు. లక్షలు పోసినా మంచి అబ్బాయి దొరకడం కష్టం. ఎలాగైనా వాళ్లని మంచి చేసుకుని వాళ్ల అబ్బాయికి మన అమ్మాయినిచ్చి పెళ్ళి చేద్దాం''

"ఇన్ని సంవత్సరాలు గుర్తురాని ఇంటి ఆడప డుచు, మేనల్లుడు ఇప్పుడు గుర్తుకురావడం నిజంగా విచిత్రమే. ఇప్పుడు పెళ్లి సంబంధం గురించి మాట్లాడడం బాగోదు. వాళ్ళు కష్టాలలో ఉన్నప్పుడు ఆదుకోని మనకు పెళ్లి గురించి మాట్లాడే అర్హతలేదు. అబ్బాయి సంపాదన చూడ గానే కన్నుకుట్టింది. ఇన్నిరోజులు లేని అన్న ఇప్పు డెలా వచ్చాడో అని లోకం కోడై కూస్తుంది. అయినా ఇప్పుడే మొహం పెట్టుకుని వాళ్లింటికి వెళ్లాలి. అందుకే ఈ సంబంధం నాకిష్టం లేదు''

"మనం అనుకుంటే తెగిపోయే బంధాలా? నీ తోడబుట్టిన చెల్లి. అవునన్నా కాదన్నా రక్త సంబంధం తెగిపోతుందా? మీకు నచ్చినా నచ్చక పోయినా ఈ సంబంధం చేసుకోవలసిందే'' అంటూ గర్జించింది.

"నేను వెళ్లనుగాక వెళ్లను'' కాంతం ఏదో సర్దిచె ప్పబోయింది. గోపాలం కాదన్నాడు.

కాంతం మరోసారి ఇంట్లోని సామానంతా ఎత్తేసి, తన్నేసి గ్యాస్ సిలిండర్ దగ్గరకు వెళ్లింది.

దీంతో హడలిపోయిన గోపాలం సరేనని మొత్తుకున్నాడు.

* * *

నిజానికి జరిగిందేంటంటే...

కష్టాలలో ఉన్న తన చెల్లి, బావకు గోపాలం ఎంతో ధనసాయం చేశాడు. మేనల్లుడిని పెద్ద చదు వులు చదివించి ఎంతో కష్టపడి ఉద్యోగం కోసం లండన్ పంపించింది గోపాలమే. తన కూతురికి అల్లుడిపై ప్రేమ కలిగేటట్లు చేసి వాళ్ళు ప్రేమించు కునేలా చేసింది అతడే. చెల్లి కుటుంబాన్ని కంటికి రెప్పలా కాపాడాడు గోపాలం. ఇన్ని రహస్యాలు పిచ్చి కాంతంకు తెలియవు. కాంతంకు తెలియ కుండా ఉండడం కోసం ఎన్ని కష్టాలు పడ్డాడో!

త్వరలోనే కాంతం తన కూతురి పెళ్లి తను అను కున్నట్లే మేనల్లుడితో ఘనంగా జరిపించింది.

అంతా తాను అనుకున్నట్లే జరిగిందని సంతో షించింది కాంతం. అంతా తను అనుకున్నట్లే జరి గిందని సంతోషించాడు గోపాలం. ★